క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ఎలిగేడు: మండల ప్రజల రెండున్నర దశాబ్దాల ఆకాంక్షను నెరవేర్చిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావును ఆదివారం శివపల్లిలో ఎమ్మెల్యే నివాసంలో ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీశ్ ఆధ్వర్యంలో సన్మానించారు. 23 ఏళ్లక్రితం ఏర్పడిన ఎలిగేడు మండలానికి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వాలకు విన్నవించినప్పటికీ ఫలితం రాలేదన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు ఇచ్చిన మాటకు కట్టుబడి పోలీస్‌స్టేషన్‌ను మంజూరు చేయించారన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న దాతలు

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేదలు తమ్మడవేని బొందమ్మ, కీ.శే కనుకయ్య కూతురు రజిత, అబ్బాపూర్ గ్రామానికి చెందిన బొమ్మెనవేని లక్ష్మి, కొమురయ్య దంపతుల కూతురు శ్రీలేఖ వివాహాలకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ ఆర్థికసాయం అందజేశారు. స్థానిక యాదవ కమ్యూనిటీ భవనంలో నేనున్నా స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రజిత, శ్రీలేఖకు రూ.10వేల చొప్పున అందజేశారు. నాయకులు దండె వెంకటేశం, పొలగాని సతీశ్, మేర శ్రీనివాస్, బాణాల కొమురయ్య, మల్లెత్తుల కనుకయ్య, ఆవుల బాలయ్య, తాజోద్దీన్, గాండ్ల చంద్రయ్య, బొమ్మెనవేని రాజయ్య, కనుకయ్య, మారం మల్లయ్య, వినయ్ ఉన్నారు.

ఘనంగా పడిపూజ



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు గ్రామంలో శనివారం రాత్రి మాజీ కార్పొరేటర్ స్టాలిన్ గౌడ్ ఆధ్వర్యంలో మాంత్రిక పూజారి సాయికిరణ్‌శర్మ గురుస్వామితో కొయ్యడ సంతోష్–రమ్య కుటుంబ సభ్యులతో కలిసి మహా పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు–శైలజ దంపతులు హాజరయ్యారు. శ్రీఅద్దెంకి సారంగచారి గురుస్వామి, కొయ్యడ శంకర్ సత్యవతి, నాయకులు రాకేశ్, పూదరి సత్యనారాయణ, సాయికిరణ్ శర్మ, కార్పొరేటర్లు శంకర్‌నాయక్, సాగంటి శంకర్, అంజలీదేవి పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న మనాలీ ఠాకూర్

గోదావరిఖని: స్థానిక బస్టాండ్ కాలనీలో నివసిస్తున్న ఆటోడ్రైవర్ రాజనర్సుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాకూర్ రూ.15వేలు అందజేశారు. పక్షవాతం రావడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఆన్‌ఫాజివ్ సంస్థ సభ్యులు స్పందించి ఎమ్మెల్యే సతీమణి చేతుల మీదుగా నగదు అందించారు. కార్యక్రమంలో వేముల మహేందర్, రాదండి బాలయ్య, ప్రభాకర్, శ్రవణ్‌కుమార్, శంకరయ్య పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ఓదెల: మండలంలోని పొత్కపల్లిలో సొసైటీ చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. లయన్స్‌క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపకుడు, కంటి వైద్య నిపుణులు పూదరి దత్తాగౌడ్ ఉచితంగా 262మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. ఇందులో 57 మందికి చల్మెడ ఆనందరావు హాస్పిటల్‌లో ఆపరేషన్ అవసరమని డాక్టర్ తెలిపారు. ఆపరేషన్లు చేయించుకునేవారికి ఉచితంగా ప్రయాణం, భోజనం సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్, మాజీ ఉపసర్పంచు వంగ శ్రీనివాస్, గీతాంజలి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పల్కపాటి రాజేశ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు రెడ్డి రజనీకాంత్ పాల్గొన్నారు.

టీబీపై అవగాహన

పాలకుర్తి: మండల కేంద్రంలో నిక్షయ్ శివర్‌లో భాగంగా ఆదివారం టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ గోపికృష్ణ పాల్గొని స్థానికులకు క్షయ వ్యాధి, నివారణ గురించి వివరించారు. గ్రామానికి చెందిన 40మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు.

అయ్యప్పస్వాములకు నిత్య భిక్ష

- పలు ప్రాంతాల నుంచి వచ్చే స్వాములకు భిక్ష, బస చేయడానికి ఏర్పాట్లు



శాస్త్రినగర్‌లో అయ్యప్ప దీక్షాపరులకు బిక్ష పెడుతున్న నిర్వాహకులు (ఫైల్)

సుల్తానాబాద్: అయ్యప్ప స్వాముల కోసం పట్టణంలోని శాస్త్రినగర్ హనుమాన్ టెంపుల్ సమీపంలో ప్రత్యేక షెడ్లలో, నీరుకుల్ల రోడ్డులోని అయ్యప్ప ఆలయాల్లో నిత్య భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. అయ్యప్ప మాల ధరించిన వారికి ఇబ్బందులు కలగకుండా, ఇంట్లో సౌకర్యాలు లేని వారికి ఆలయంలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. నిత్యం మధ్యాహ్నం సమయంలో సుమారు 200 నుంచి 400 మంది స్వాములకు భిక్ష నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల వ్యాపారులు, రాజకీయ నాయకులు, తదితరులు వారి ఇంట్లో వేడుకల సందర్భంగా అయ్యప్పస్వామి స్వాములకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. పట్టణమే కాకుండా దూర ప్రాంతాల స్వాములు భిక్ష సమయంలో ఆలయానికి వస్తే భిక్ష చేయడంతో పాటు పలు రకాల పూజలు చేసుకునేందుకు నిర్వాహకులు సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్, ఓదెల, పెద్దపల్లి, ఎలిగేడు, మండలంలో పలు ప్రాంతాల అయ్యప్పస్వామి దీక్షాపరులతోపాటు రహదారి వెంట వెళ్లే వారికి సైతం భిక్ష ఏర్పాటు చేస్తున్నారు.

15 ఏళుగ్గా అన్నదానం



15ఏళ్ల నుంచి అయ్యప్పస్వామి దీక్షాపరులకు నిత్య భిక్ష కార్యక్రమం కొనసాగుతోంది. పలువురు వ్యాపారులు, రాజకీయ నాయకుల సహకారంతో కార్యక్రమం ముందుకు సాగుతోంది. ఆలయంలో నిత్యం అయ్యప్పస్వామి దీక్షాపరులు భజన చేసుకోవడానికి సకల ఏర్పాట్లు చేశాం. ఇతర ప్రాంతాల వారు సైతం భిక్ష సమయంలో వచ్చి వెళ్తారు.

– సాహిరి మహేందర్, గురుస్వామి, శాస్త్రినగర్



జూలపల్లి: మండలంలోని వద్యాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడేళ్ల క్రితం మన ఊరు–మనబడి పథకంలో మధ్యాహ్న భోజనానికి డైనింగ్ హాల్ మంజూరైంది. కాగా నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్ గోడల వరకు నిర్మించి వదిలేశాడు. అధికారులు నిధులు మంజూరు చేసి డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి



మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కేటగిరీల వారీగా పెంచాలని కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని పెద్దపెల్లిలోని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ బకాయి వేతనాల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై చర్యలు తీసుకొని వేతనాల చెల్లింపునకు ప్రభుత్వ బడ్జెట్ కేటాయించాలని కోరారు. నేరుగా కార్మికుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమచేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తూ డిసెంబర్ 20 తర్వాత సమ్మెకు వెళ్తామని పేర్కొన్నారు. సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు సీపెల్లి రవీందర్, ఎండీ ఖాజా, కమిటీ సభ్యులు తీట్ల శ్రీనివాస్, ఆకుల రాజయ్య, పైడిపల్లి నాగయ్య, అంబాల లక్ష్మణ్, ముస్తఫా, రెడ్డిమల్ల నాగేశ్వర్, రవికుమార్, మల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని విఠల్ నగర్‌లో ఆదివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. శిబిరంలో సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి పైగా బీపీ, షుగర్, ఈసీజీ, తదితర సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలను ఆసుపత్రి డాక్టర్ దీక్షిత్ నిర్వహించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు, స్థానిక ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతోనే ఈ వైద్యశిబిరం నిర్వహించామన్నారు. తిరుపతి, పోషం, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, హరీశ్, యూనస్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా అజయ్



అభినందిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన అశోద అజయ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన అజయ్‌ను స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ సన్మానించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అజయ్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్‌తో పాటు పలువురు సన్మానించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మాజీ ఎంపీటీసీ గందం మహిపాల్, మాజీ సర్పంచు కొమురయ్య పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ: గోదావరిఖని పీజీ కాలేజీ మైదానంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తండ్రి కిషన్‌సింగ్ ఠాకూర్ జ్ఞాపకార్థం ఆదివారం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలు జరగనున్నాయి. క్రీడాకారులు ప్రతిభ చాటాలని మేయర్ కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహంకాళిస్వామి, కాంట్రాక్టర్ విశ్వతేజ, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం కప్ ఆటల పోటీలు ప్రారంభం



సుల్తానాబాద్‌రూరల్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్‌ఎం కవిత



ఓదెల: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సొసైటీ చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ ఆటల పోటీలను ఆదివారం హెచ్‌ఎం కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా అండర్–18 బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి లచ్చయ్య, ఉపాధ్యాయులు శంకరయ్య, వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి

ఓదెల: గ్రామీణ క్రీడాకారులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని పొత్కపల్లి హైస్కూల్‌లో ఆదివారం సీఎం కప్–2024 గ్రామీణ క్రీడలను సొసైటీ చైర్మన్ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పీడీ హరికృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మౌనిక పాల్గొన్నారు.

సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్‌కు గుర్తింపు

సుల్తానాబాద్: వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 303 ఏరియాకు అనుబంధంగా సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్‌ను గుర్తిస్తూ సర్టిఫికెట్ ఆదివారం అందజేశారు. ఉమ్మడి జిల్లా కరీంనగర్ కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ పచ్చిమట్ల ఎల్లాగౌడ్ పాల్గొని నూతనంగా ఎన్నికైన వాకర్స్ అసోసియేషన్ బాధ్యులకు సర్టిఫికెట్ అందజేశారు. సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బైరగోని రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మంద శ్రీనివాస్, చొప్పరి సుమన్‌తోపాటు పలువురు సభ్యులతో కూడిన నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పలు సామాజిక సేవలతోపాటు నడవండి, నడిపించండి, అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో ముందుకు సాగుతామని అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ శ్రీనివాస్, భారతి, బుర్ర జగదీశ్వర్‌గౌడ్, గొట్టెముక్కుల రవీందర్‌రెడ్డి, గుడిపాటి రమణారెడ్డి, చాడ రవీందర్‌రెడి, పెంచాల కిషన్, అశోక్, గంగా తిరుపతి, వెంకటరెడ్డి, పర్శరాం, రాజు పాల్గొన్నారు.

ఓదెలలో సర్వే డాటా ఎంట్రీ పూర్తి

ఓదెల: మండలంలో సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీ పూర్తయినట్లు ఎంపీడీవో తిరుపతి ఆదివారం తెలిపారు. మండలంలోని 22 గ్రామాల్లో 10మంది సూపర్‌వైజర్లు, 102మంది ఎన్యుమరేటర్లు చేసిన సర్వే వివరాలను పూర్తిగా ఆన్‌లైన్ చేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

• పరామర్శ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామానికి జగన్‌మోహన్‌రావు తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. అతడి బాల్యమిత్రుడైన స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ఆదివారం వాళ్ల ఇంటికి పరామర్శించారు.

• గ్రామాల్లో సీపీఐని బలోపేతం చేస్తాం

ఓదెల: గ్రామాల్లో సీపీఐని బలోపేతం చేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు. ఓదెలలో ఆదివారం సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

• తప్పిపోయిన బాలుడు.. తల్లిదండ్రులకు అప్పగింత

రామగుండం: జార్ఖండ్‌కు చెందిన ఓ పన్నెండేళ్ల బాలుడు గుర్తు తెలియని రైలు ఎక్కగా ఈనెల 5న రామగుండం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు గుర్తించి చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులకు సమాచారం అందించారు. సదరు బాలుడిని అదుపులోకి తీసుకొని స్థానిక తబితా ఆశ్రమానికి తరలించారు. బాలుడు తెలిపిన చిరునామాతో తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో ఆదివారం బాలుడి తల్లిదండ్రులు రామగుండం చేరుకోగా బాలుడిని వారికి అప్పగించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎవరైనా చిన్నారులు తప్పిపోతే హెల్ప్‌లైన్ నెంబర్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్, జిల్లా చైల్డ్ ఆఫీసర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కమలాకర్, కౌన్సిలర్ రేణిగుంట్ల సతీశ్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ గట్టు శ్రీధర్, సభ్యులు శ్యాంసుందర్, నీలం ఐలయ్య, సుమలత, ఆశ్రమ నిర్వాహకుడు వీరేందర్‌నాయక్ ఉన్నారు.

• గ్రాట్యుటీ వర్తింపుపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి

గోదావరిఖని: రూ.20లక్షల గ్రాట్యుటీ వర్తింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. 2016 జూలైలో పదో వేతన ఒప్పందం ప్రారంభం కాగా 2017 అక్టోబర్ 10న వేతన ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వ గ్రాట్యుటీని రూ.20లక్షలకు పెంచుతూ చట్టం చేయకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. చట్టం ప్రకారం గెజిట్ 2018 ఫిబ్రవరి 29 నుంచి పెంచిన గ్రాట్యుటీ అమలు చేస్తున్నారన్నారు. కొందరు కార్మికులు కోలిండియాలో ఇంతకుముందే కోర్టులో కేసు వేయగా అక్కడి లేబర్ కమిషనర్ వడ్డీతో సహా చెల్లించాలని సిఫారసు చేశారు. ఇదే అంశంపై సింగరేణిలోనూ ఒకరిద్దరు కోర్టులో కేసు వేయగా గ్రాట్యుటీ వడ్డీతో సహా చెల్లించాలని నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు అట్టి నిర్ణయాన్ని యాజమాన్యాలు అమలు చేయలేదని, ఈ విషయంలో కేంద్రం తొందరగా తేల్చాలన్నారు.

• విద్యుత్‌శాఖ వాచ్‌మన్ అసోసియేషన్ ఎన్నిక

సుల్తానాబాద్: పెద్దపల్లి డివిజన్ ఎన్పీడీసీఎల్ వాచ్‌మన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సుల్తానాబాద్‌లో ఎన్నుకున్నారు. మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామానికి చెందిన అధ్యక్షుడిగా పూసాల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఈర్ల సదయ్య, గౌరవ అధ్యక్షుడిగా దూడపాక పోచాలు, కోశాధికారిగా వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన రాజ్‌కుమార్ మాట్లాడుతూ సంఘం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు.

• కరెంట్ షాక్‌తో ఆవు మృతి

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన బాద్రపు శ్రీనివాస్ ఆవు ఆదివారం కరెంట్ షాక్‌తో మృతి చెందింది. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఆవు గ్రామంలోని గొల్లవాడ ప్రాంతంలో మేత మేస్తుండగా అక్కడే ఉన్న ఎస్‌ఎస్–99 ట్రాన్స్‌ఫార్మర్(25 కేవీ) వద్ద కరెంట్ షాక్‌తో మృతి చెందిందన్నారు. ఆవు విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిళ్లలో ఆదివారం పెద్దమ్మ బోనాలను ముదిరాజు కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లతో శివసత్తుల పూనకాలతో పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

వసతి గృహాల్లోని సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న చుక్క శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని వసతి గృహాలను బీఆర్‌ఎస్ శ్రేణులు తనిఖీలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు బలహీనవర్గాల వసతి గృహాలను బీఆర్‌ఎస్వీ నాయకులు పరిశీలించారు. సొంత భవనాలు లేకుండా అద్దె భవనాల్లో వసతి గృహాలు నిర్వహిస్తుండడంతో పాటు తరగతి గదులు ఇరుకుగా ఉండడం విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని బీఆర్‌ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్ ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కల్పించిన కనీస వసతులు కూడా ఈ ప్రభుత్వం కల్పించడం లేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు వెంటనే పరిశీలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్వీ మాజీ రాష్ట్ర కార్యదర్శి రాజోజుల శివ, జిల్లా నాయకులు ఉప్పు శివ పటేల్, నాయిని అన్వేష్, గోవర్ధన్ చారి, బోయిని మనోజ్, కుక్క మనోజ్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ రోజు శరీరదానానికి అంగీకారం



కనకయ్యను సత్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: పెద్దపల్లి మండలం గుర్రంపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి నేదునూరి కనకయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనకయ్య–రేణుక దంపతులు శరీరదానానికి ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వారికి డోనర్ కార్డులు అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. మండల విద్యాధికారులు సురేంద్రకుమార్, ఆగయ్య, టీపీటీఎఫ్ జిల్లా నాయకులు పోచయ్య, పర్శరాములు, రాజనర్సు, జెడ్పీహెచ్ హెచ్‌ఎం జానకి, స్నేహితులు రాజయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

బ్రిలియంట్ మోడల్ స్కూల్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు



అవార్డు అందుకుంటున్న చైర్మన్ సత్యనారాయణ

ధర్మారం: మండలం కేంద్రంలోని బ్రిలియంట్ మోడల్‌స్కూల్ రాష్ట్రంలోని స్టేట్‌బోర్డు పాఠశాలల్లో టాప్–20 పాఠశాలగా గుర్తింపు లభించింది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఈటీ టెక్ సంస్థ నిర్వాహకులు రాష్ట్రంలోని స్టేట్ బోర్డు పాఠశాలల పనితీరుపై సర్వే నిర్వహించారు. సర్వేలో ధర్మారంలోని బ్రిలియంట్ మోడల్ స్కూల్‌కు టాప్ 20గా గుర్తింపు నిచ్చినట్లు విద్యాసంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్‌కు అవార్డు ప్రదానం చేశారు.

పాఠశాలకు గర్వకారణం..

ఈటీ టెక్ నిర్వహించిన సర్వేలో తమ పాఠశాల రాష్ట్రంలోనే టాప్ 20గా గుర్తింపు రావడం ఎంతో గర్వకారణం. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతోనే ఈ అవార్డు దక్కిందన్నారు.

దివ్యాంగురాలి మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు

రామగుండం: పట్టణంలోని అయోధ్యనగర్‌లో అనుమానాస్పదంగా మృతిచెందిన దివ్యాంగురాలి మృతిపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతుందని ఎస్సై సంధ్యారాణి పేర్కొన్నారు. వివరాలు.. రైల్వేలో రిటైర్డ్ ఉద్యోగి జక్కనబోయిన లక్ష్మి, మీనయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, కూతురు సంతానం. కుమారులకు పెళ్లయింది. కూతురు రాజేశ్వరి దివ్యాంగురాలు కావడంతో తండ్రి మరణానంతరం ఆయన పెన్షన్ రూ.18వేలు వస్తోంది. శ్రీరాంపూర్‌లో ఉంటున్న సోదరుడు మల్లయ్య వద్ద ఉంటున్న ఆమె.. మూడు నెలల క్రితం అయోధ్యనగర్‌లో ఉంటున్న రెండో సోదరుడు కనకయ్య వద్దకు వచ్చింది. ప్రత్యేక రేకుల షెడ్డులో నివాసం ఉంచి పనిమనిషిని సమకూర్చారు. కనకయ్య తన భార్య ఆరోగ్యం సరిగా లేకపోవడంతో 4రోజుల క్రితం హైదరాబాద్ తీసుకెళ్లాడు. శనివారం పనిమనిషి వచ్చి చూడగా రాజేశ్వరి షెడ్డులో మెడకు చున్నీ ఉండి.. కింద పడుకోబెట్టినట్లు రక్తపు మడుగులో కనిపించింది. వెంటనే డయల్ 100కు సమాచారం అందించడంతో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఆమెను ఎవరో హత్య చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. రాజేశ్వరి పెద్ద సోదరుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భగవాన్ బుద్ధ జాతీయ అవార్డు అందుకున్న దుర్గం నగేశ్



నగేశ్‌తో పాటు పలువురు అవార్డు గ్రహీతలు

జ్యోతినగర్: భగవాన్ బుద్ధ జాతీయ అవార్డును దుర్గం నగేశ్ అందుకున్నారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన భారతీయ దళిత సాహిత్య అకాడమీ భగవాన్ బుద్ధ జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన దుర్గం నగేశ్‌కు అవార్డు అందించారు. భారతీయ దళిత సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు సుమనాక్షర్, రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ మనూ నగేశ్‌కు అవార్డు అందజేశారు. సాంఘిక సేవారంగంలో దుర్గం నగేశ్ చేసిన నిస్వార్థ సేవ, ప్రజా జీవితంలో చేసిన అత్యుత్తమ ప్రతిభకు గాను అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.